
ఈనాడు
పెద్దపల్లి
గురువారం సెప్టెంబరు 26, 2024

భద్రత కరవైన బాల్యం

- పాఠశాలల ఆవరణల్లో అపరిశుభ్రత
- విష పురుగుల సంచారంతో భయం

చదువుల తల్లి ఒడిలో హాయిగా సేద తీరాల్సిన బాలలకు భద్రత కరవైంది. చెత్త, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో పాఠశాలల ఆవరణలు విష కీటకాలకు ఆవాసంగా మారాయి. ఏకాగ్రతతో పాఠాలు నేర్వాల్సిన విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది.
–న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఓదెల



జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాల భవనాల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ఆదర్శ పాఠశాలలుగా గుర్తించిన 635 బడుల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచాయి. ఆవరణలో కంకర, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి జనార్దన్‌రావును 'న్యూస్‌టుడే' మాట్లాడుతూ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల సమస్యపై ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేస్తే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో తొలగిస్తారన్నారు. విషపురుగుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

- **పాఠశాల :** ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, మచిలిఖేడ్, పెద్దపల్లి.
- **సమస్య:** బడి ముందు నుంచి మురుగు పారుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.
- **ఎప్పటి నుంచి:** ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి.
- **ఎదురవుతున్న ఇబ్బందులు:** పట్టణంలోని చాలా ప్రాంతాల మురుగు పాఠశాల ముందు నుంచే పారుతోంది. పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగుల ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల ఆవరణిలో కంకర, ఇతర సామగ్రితో అపరిశుభ్రత నెలకొంది.



▲ **పరిష్కారం:** చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, తుమ్మ పొదలు తొలగించాలి. మురుగు కాలువను మరో ప్రాంతానికి మళ్లించాలి.

- కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.
- ◆ సమీపం వరకు పెరిగిన పిచ్చిమొక్కలు.
- ■ ఏడాది కాలంగా. ✷ విష కీటకాలు సంచరిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. ▲ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి మొరం పోసి చదును చేయాలి.



- ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాల.
- ◆ ప్రహరీ లేక రక్షణ కరవు. ■ బడి ప్రారంభం నుంచి (25 సంవత్సరాలుగా)
- ✷ **ఎదురవుతున్న ఇబ్బందులు:** సమీపంలో తుమ్మ పొదలు దట్టంగా పెరిగి పాములు, తేళ్ల సంచారానికి అవకాశం ఉంది. పాఠశాలకు ఎదురుగానే దహన వాటిక ఉండటంతో అంత్యక్రియల సమయంలో పాఠశాలలోకి పొగ వస్తోంది. విద్యార్థులు భయంతో పాఠశాలకు రావడం లేదు.
- ▲ ప్రహరీ నిర్మాణంతో పాటు దహనవాటిక తరలించడం.



- సుల్తానాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం.
- ◆ పక్కనే ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువలో పేరుకుపోయిన చెత్త.
- ■ రెండు సంవత్సరాలుగా.
- ✷ ఈ నెల 11న ఆరో తరగతి విద్యార్థి మన్విత్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. గ్రామ శివారులోని పొలాల మధ్య ఉండటంతో విష కీటకాలకు ఆవాసంగా మారింది.
- ▲ పాఠశాలలో చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి, మురుగు కాలువ వద్ద భద్రత ఏర్పాట్లు చేస్తే విష పురుగుల బెడద సమస్య తొలగనుంది.



పోలీసు విధులపై ప్రత్యక్ష అవగాహన



బాంబు డిటెక్టర్‌తో తనిఖీ తీరును ప్రదర్శిస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, ఇతర అధికారులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: పోలీసు దైనందిన విధులపై అవగాహన కల్పించడానికి బుధవారం రామగుండం కమిషనరేట్‌లో డ్యూటీ మీట్ నిర్వహించారు. తెలంగాణలోనే మొదటిసారి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కమిషనర్ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది తమ ప్రతిభను ప్రదర్శించారు. శాస్త్రీయ విధానంలో కేసుల విచారణ, ఫోరెన్సిక్ సైన్స్, నేర విచారణ, క్రిమినల్ లా, మెడికో లీగల్ పరీక్ష, ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్‌హిబిట్స్, ఫింగర్‌ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. వాహన తనిఖీలు, మైదానాల పరిశీలన, డాగ్‌స్క్వాడ్, ట్రాకింగ్, నార్కొటిక్, పోలీస్ ఫొటోగ్రఫీ పోటీలు చేపట్టారు. ప్రతిభ కనబరిచిన పోలీసులను ఎంపిక చేసి కాళేశ్వరం జోన్ స్థాయి మీట్‌కు పంపించనున్నారు. అక్కడ ఎంపికైతే రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని సీపీ తెలిపారు. నేరాలను శాస్త్రీయంగా గుర్తించి విచారణలో నైపుణ్యం ప్రదర్శించాలని, దీని ద్వారా వృత్తి నైపుణ్యం పెరుగుతుందని ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తాము చేసే వృత్తిలో మరింత మెరుగైన పనితీరును ప్రదర్శించేందుకే ఈ మీట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రాజు, ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, వెంకటస్వామి, మల్లారెడ్డి, ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో రోగ నిర్ధారణ కీలకం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: సురక్షితమైన వైద్యం అందించాలంటే రోగ నిర్ధారణ కీలకమని గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందుసింగ్ పేర్కొన్నారు. గోదావరిఖనిలో బుధవారం ప్రపంచ రోగుల రక్షణ వారోత్సవాల్లో భాగంగా వైద్య విద్యార్థులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వద్ద ప్రారంభమైన ర్యాలీ వైద్య కళాశాల వరకు సాగింది. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. వైద్య రంగంలో రోగ నిర్ధారణ తీరు మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని.. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్య కళాశాల ఆచార్యులు అనంతబాబు, కల్పన, హర్షిణి, ఓబులేష్, హెల్త్ ఎడ్యుకేటర్ నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రి స్థాయి పెంపునకు కృషి



శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, చిత్రంలో కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆధునికీకరణ ప్రక్రియ చేపట్టినట్లు ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. పెద్దపల్లిలోని జిల్లా ప్రధాన ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల విభాగం, కంటి శస్త్రచికిత్స విభాగం, దంత వైద్య విభాగం, పోలీస్ అవుట్‌పోస్టులను బుధవారం ఆయన కలెక్టర్ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత మూడు నెలల్లో జిల్లా ఆస్పత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రం పనితీరు గణనీయంగా మెరుగైందన్నారు. ప్రసవాలు, ఎముకల సంబంధిత శస్త్రచికిత్సలు పెరిగాయన్నారు. గర్భిణుల కోసం టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆస్పత్రి స్థాయిని 150 పడకలకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆస్పత్రి పర్యవేక్షకులు శ్రీధర్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ప్రమోద్‌కుమార్, ఆర్ఎంవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు

అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25 నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. బుధవారం ఆయన పాలనా ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్, పర్యవేక్షకులు రాజయ్య, వయోవృద్ధులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల నియామక ఇంటర్వ్యూలు 8న

పెద్దపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్పత్రుల్లో యోగా శిక్షకుల నియామకానికి ఈ నెల 28న కరీంనగర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆయుష్ ఇన్‌ఛార్జి అరుణ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 10 మంది పురుష, 10 మంది మహిళా బోధకులను నియమించనున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు కరీంనగర్ రాంనగర్‌లోని ఆయుష్ ఆయుర్వేద ఆస్పత్రిలో శనివారం ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

కట్టుదిట్టంగా లడ్డూ ప్రసాదం

- తితిదే ఘటనతో దేవాదాయశాఖ అప్రమత్తం
- ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పర్యవేక్షణ



ధర్మపురి దేవస్థానం లడ్డూ ప్రసాదం

న్యూస్‌టుడే, ధర్మపురి, వేములవాడ, మల్యాల

ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన వేములవాడ, కొండగట్టు, ధర్మపురి దేవస్థానాల లడ్డూ, పులిహోర ప్రసాదాలను భక్తులు పరమ పవిత్రంగా భావించి కొనుగోలు చేస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో లడ్డూ తయారీలో తప్పిదం జరిగిందని ఆరోపణలు రావడంతో రాష్ట్ర దేవాదాయశాఖ అప్రమత్తమైంది.. ప్రధాన ఆలయాల్లో దిట్టం ఉత్తర్వులను తూచా తప్పకుండా పాటించాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు.. రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో విజయ తెలంగాణ డెయిరీ నెయ్యిని మాత్రమే వినియోగించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ధర్మపురిలో రోజుకు 2 వేల విక్రయం

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లడ్డూ ప్రత్యేకంగా నిలుస్తోంది. 80 గ్రాముల లడ్డూ ప్రసాదానికి రూ.20, 200 గ్రాముల పులిహోర ప్రసాదానికి రూ.15 తీసుకుంటున్నారు. ప్రతిరోజు సరాసరి 2 వేలలు, శని, ఆదివారాలు 3 నుంచి 5 వేల వరకు లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తారు. దిట్టం సామగ్రిని ఉప ప్రధాన అర్చకుడు, సంబంధిత స్టోర్ ఇన్‌ఛార్జి, ఈవో ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. 10 కిలోల లడ్డూ ప్రసాదానికి 7 కిలోల నెయ్యి, 20 కిలోల చక్కెర, కాజు 700 గ్రాములు, కిస్‌మిస్‌లు 750 గ్రాములు, యాలకులు 100 గ్రాములు, కర్పూరం 10 గ్రాములు, జాజికాయ 10 గ్రాములు, మిస్రీ 500 గ్రాములు వినియోగిస్తున్నామని అధికారులు చెప్పారు. 2023 - 24 సంవత్సరానికి లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,50,20,00, పులిహోర ప్రసాదం ద్వారా రూ.54,69,750 ఆదాయం సమకూరింది. ఈవో సంకటాల శ్రీనివాస్ మాట్లాడుతూ ధర్మపురి దేవస్థానంలో లడ్డూ ప్రసాదాల విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నామని, ప్రస్తుతం కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజన్న ఆలయానికి రూ.20 కోట్ల ఆదాయం



వేములవాడ లడ్డూ తయారీలో మహిళా కార్మికులు

వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ప్రత్యేకంగా స్వామివారి ప్రసాదం లడ్డూలను మహా ప్రసాదంగా భావించి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. లడ్డూల తయారీని ఒక ఏఈవో, పర్యవేక్షకుడు, సిబ్బంది తనిఖీ చేస్తారు. భక్తుల రద్దీ అంచనాతో లడ్డూలను తయారు చేస్తుంటారు. దాదాపు ప్రతి నెల 10 నుంచి 15 వేల కిలోల నెయ్యిని లడ్డూల తయారీకి వినియోగిస్తుంటారు. ఆలయానికి ఏడాదికి రూ.20 కోట్ల ఆదాయం లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా సమకూరుతోంది. కిలో లడ్డూ తయారీకి 650 గ్రాముల నెయ్యి వినియోగించాల్సి ఉంటుంది. ఆలయానికి సరఫరా అయ్యే నెయ్యికి ఆరు నెలల కాలపరిమితి మాత్రమే ఉంటుంది. అందుకు అనుగుణంగానే నాణ్యమైన నెయ్యిని లడ్డూల తయారీలో వినియోగిస్తున్నామని ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల అనిశా అధికారుల తనిఖీ సమయంలో తూనికలు, నాణ్యత ప్రమాణాల అధికారులు నెయ్యి నమూనా కూడా తీసుకెళ్లారని చెప్పారు.



కొండగట్టులో లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న దృశ్యం

కొండగట్టులో ఏటా 50 వేల కిలోల నెయ్యి వినియోగం

కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులు లడ్డూతో పాటు పులిహోర ప్రసాదం కొనుగోలు చేస్తుంటారు. శని, మంగళవారాల్లో దాదాపు 15 వేల లడ్డూలు, 5 క్వింటాళ్ల పులిహోర తయారు చేసి విక్రయిస్తుంటారు. 100 గ్రాముల లడ్డూ రూ.25కు, 200 గ్రాముల పులిహోర రూ.20లకు విక్రయిస్తుంటారు. ప్రతి సంవత్సరం దాదాపు 25 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయిస్తున్నా.. పులిహోర తయారీకి ఖర్చు తక్కువ కావడంతో 75 శాతం లాభం ఈ ప్రసాదం ద్వారానే సమకూరుతుందని అధికారులు చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై వివాదం నేపథ్యంలో కొండగట్టు అంజన్న ఆలయానికి సరఫరా చేస్తున్న నెయ్యిని కూడా పరీక్షలు చేయిస్తామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. లడ్డూ తయారీకి ప్రతి నెలా 4 వేల కిలోల చొప్పున, ఏడాదికి 50 వేల కిలోల వరకు నెయ్యిని ఖరీదు చేస్తున్నట్లు చెప్పారు.

ఖనికి ప్రసూతి ఇంటెన్సివ్ కేర్ యూనిట్ మంజూరు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రికి ప్రసూతి ఇంటెన్సివ్ కేర్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఆసుపత్రి ఆధునికీకరణ పనులను బుధవారం పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రసూతి ఇంటెన్సివ్ కేర్ ఏర్పాటుకు ఆసుపత్రి ఆవరణలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది క్వార్టర్లను ఆధునికీకరించి టి.బి. కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దవాఖానలోని రెండు భవనాలను అనుసంధానించేలా రహదారి, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో విద్యుత్తు అంతరాయాలను అధిగమించేలా ప్రత్యేక ఫీడర్ ఏర్పాటుకు విద్యుత్తు శాఖాధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ హిమబిందుసింగ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ ప్రారంభం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పేర్కొన్నారు. రామగుండం నగరపాలక కార్యాలయం ఆవరణలోని సామాజిక వనరుల భవనంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు స్వామి, రాజేశ్, సహాయ కమిషనర్ రాజలింగు, అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

'మా కాలనీలో మురుగు కాలువ లేక దుర్గంధం వెదజల్లుతోంది.. రహదారులు ధ్వంసమై రాకపోకలకు అవస్థలు పడుతున్నాం.. మైదానంలో దీపాలు లేక ఉదయం నడక సమయంలో అంధకారం అలముకుంటోంది..' ఇలా వివిధ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులను ఏకరవు పెట్టారు. పాఠకుల ప్రశ్నలకు పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ ఓపికగా సమాధానాలిచ్చారు. బుధవారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్-ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. –న్యూస్‌టుడే, పెద్దపల్లి

ఈనాడు మీతోడు

? ఆరో వార్డులోని కూనారం రోడ్డు సమీపంలో మురుగుకాలువ లేక అపరిశుభ్రత నెలకొంది.
-మాతంగి నర్సింగం, కూనారం రోడ్డు
✔ అక్కడ కాలువ నిర్మాణానికి రోడ్డు కటింగ్ అవరోధంగా మారింది. ఇంజినీరింగ్ అధికారులను పంపించి ప్రత్యామ్నాయ మార్గాలతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

? నల్లపోచమ్మవాడలో షమీమ్ కిరాణం నుంచి సీసీ రోడ్డు నిర్మాణ ప్రతిపాదన ఎప్పుడు కార్యరూపం దాలుస్తుంది. **-సాబీర్‌ఖాన్, నల్ల పోచమ్మవాడ**
✔ కొత్త రోడ్డు వేసేందుకు టెండర్లు నిర్వహించాం. వారం, పది రోజుల్లో పనులు మొదలవుతాయి.

? స్టేషన్‌రోడ్డులోని మురుగు రైల్వే హమాలీ విశ్రాంతి షెడ్డు వెనుక వైపు చేరుతోంది. రైల్వే అధికారులకు ఫిర్యాదు చేస్తే, మున్సిపాలిటీని సంప్రదించాలంటున్నారు. **-జంగ సంపత్, రైల్వే హమాలీ నాయకుడు**
✔ స్థలం రైల్వేకు సంబంధించినది కావడంతో మురుగు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. కాలువ నిర్మాణానికి ఆ శాఖ నుంచి అనుమతి రావడం లేదు. తాత్కాలికంగా పొక్లయిన్‌తో కాలువ తవ్విస్తాం.

? ముత్యాల పోచమ్మ ఆలయ ప్రాంతం ఇరుకుగా ఉంది. భూగర్భ మురుగు కాలువ నిర్మించాలి. **-రాజు**
✔ కాలువ నిర్మాణ సాధ్యాసాధ్యాలపై రెండు రోజుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం.

? జూనియర్ కళాశాల మైదానంలో వీధి దీపాలు లేక నడకకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ట్రాక్‌పై నాటిన మొక్కల కొమ్మలు పెరిగాయి. మైదానం చివర మురుగు చేరింది. **-దేవసాని ధర్మయ్య, మోర మనోహర్**
✔ వాకింగ్ ట్రాక్ పక్కన చెట్ల కొమ్మలను తొలగిస్తాం. మైదానంలో నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటాం. వీధి దీపాలను ఇప్పటికిప్పుడే ఏర్పాటు చేస్తాం.

? చికెన్ వ్యర్థాల సేకరణకు నిర్వహించిన వేలం ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుంది?
-బొంకూరి సురేందర్ సన్నీ, నాగేందర్, ఫయాజ్, పల్లె సదానందం, రఫీఉల్లాఖాన్
✔ సీల్డ్ పెట్టెలను తెరిచాం. డాక్యుమెంట్లను పరిశీలించి, విలువలు లెక్కిస్తున్నాం. రెండు రోజుల్లో వివరాలు వెల్లడిస్తాం.

? కాకతీయ పాఠశాల సమీపంలోని చిన్న వీధిలో మూడు ఇళ్ల నుంచి నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. **-జమీల్‌ఖాన్**
✔ వీధి ఇరుకుగా ఉండటం సమస్యగా మారింది. వీలైనంత వరకు పైప్‌లైన్ ద్వారా కాలువ నిర్మాణానికి ప్రయత్నిస్తాం.

? సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్డు ధ్వంసమై వాన కురిస్తే మట్టి దారిని తలపిస్తోంది.
-వీరబోయిన రాజం, సుభాష్‌నగర్
✔ మరమ్మతుకు టెండరు ప్రక్రియ పూర్తయింది. పది రోజుల్లో పనులు మొదలవుతాయి.

? స్ఫూర్తి వికలాంగుల పాఠశాలకు వెళ్లే దారి సరిగా లేదు. వీధి దీపాలు లేవు. **-నేదునూరి దిలీప్‌కుమార్**
✔ ఇటువైపు ఇప్పటికే రోడ్డును బాగు చేశాం. మరోసారి సరిచేసి, వీధి దీపాల ఏర్పాటుకు ప్రయత్నిస్తాం.

? వైష్ణవి కాలనీలో వర్షం నీరు నిలుస్తోంది. బయటకు వెళ్లే ఏర్పాటు చేయండి. **-శ్రీకాంత్, వైష్ణవి కాలనీ**
✔ దిగువ ప్రాంతాల నుంచి మోటార్లతో వాన నీటిని ఎత్తిపోస్తున్నాం. ఖాళీ స్థలాల్లో నిలిచే నీటిని తొలగించడానికి శాశ్వత పరిష్కారమేమీ లేదు.

? నిట్టూరు రోడ్డులో చెరువు కట్టకు దిగువన కొందరు చెత్త వేస్తున్నారు. **-సతీష్, సాగర్‌రోడ్డు**
✔ ఇక్కడ చెత్త వేస్తున్న వారిలో పలువురిని గుర్తించి జరిమానా విధించాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో అరికడతాం.

? నందయ్య కాంప్లెక్స్ వైపు మార్గంలో ఓ మార్ట్‌కు సంబంధించిన వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.
-ఇనుగంటి సంతోష్‌రావు, నందయ్య కాంప్లెక్స్ వీధి
✔ సంబంధిత వ్యాపార సంస్థకు నోటీసులు ఇచ్చి, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఇబ్బందులు తొలగిస్తాం.

? మేర సంఘం శ్మశానవాటికలో మొక్కలు నాటించాలని కోరితే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు? **-సోమ శ్రీకాంత్, మంథని దామోదర్, మేరు సంఘం నాయకులు**
✔ శ్మశానవాటిక ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటిస్తాం. అక్కడి చెట్లను తొలగించేందుకు కోర్టు ఉత్తర్వులు ఉండటంతో వాటిని ముట్టుకోవడం లేదు. ఖాళీ స్థలంలో మాత్రం నాటించేందుకు రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

? చందపల్లి కంచరిబావి వద్ద చెట్లు దట్టంగా పెరిగాయి. **-రాజు, చందపల్లి**
✔ వెంటనే తొలగించి, పరిసరాలు శుభ్రపరుస్తాం.

? సీతారామాలయం వెనుక వైపు అంగన్‌వాడీ కేంద్రం నుంచి కంచరిబావి వైపు వచ్చే రహదారిపై సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు.
-కోల ప్రశాంత్, తిలక్‌నగర్
✔ టౌన్‌ప్లానింగ్ అధికారులతో పరిశీలన చేయించి, సెట్‌బ్యాక్ పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

? బండారికుంట, చింతలవాడ, మొగల్‌పురా కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.
-నజీమ్, జాఫర్‌హుస్సేన్, వసీం
✔ రామగుండంలోని ఏబీసీ కేంద్రంతో ఒప్పందం చేసుకున్నాం. కుక్కలను అక్కడికి తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తాం.

? గుండం చెరువు తూము నుంచి వదిలిన నీరు దిగువ ప్రాంత ఇళ్లలోకి చేరుతోంది. చెరువు వైపు గతంలో నిర్మించుకున్న గృహాలను తొలగిస్తారా?
-ముబాషీర్, అఫ్రోజ్ నల్లపోచమ్మవాడ

? చందపల్లిలోని బతుకమ్మ చెరువు పూర్తిగా అన్యాక్రాంతమైంది. సంరక్షణకు చర్యలు తీసుకోవాలి.
-రాజం కొమురయ్య, చందపల్లి
✔ నీటి పారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో కొలతలు వేసి, బఫర్‌జోన్‌లు నిర్దేశించిన తర్వాతే తదుపరి కార్యాచరణ ఉంటుంది. నీటిపారుదల శాఖ పరిధిలోకి అంశమైనందున వారికి నివేదిస్తాం.

మిషన్ 1000

● రోడ్డు భద్రతపై అవగాహన ● నేటితో ముగింపు


వాహనదారుడికి సూపర్ హీరో కార్డు అందజేస్తున్న దృశ్యం

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రహదారి నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో 'ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్, సాఫేర్ ఇండియన్ సంస్థ' ఆధ్వర్యంలో 'బీసేఫ్.. డ్రైవ్ సేఫ్.. రీచ్ సేఫ్..' నినాదంతో వెయ్యి రోజులపాటు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించే కార్యక్రమానికి జనవరి 1, 2022న శ్రీకారం చుట్టగా ఈ నెల 26తో ఈ కార్యక్రమం ముగియనుంది.

రోజూ కార్యక్రమాలు

- కరీంనగర్‌లో బస్టాండ్ చౌరస్తాలో వాహనదారులకు ప్రతిరోజు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు.
- నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం, సురక్షిత ప్రయాణానికి ఎలా డ్రైవింగ్ చేయాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, లైసెన్స్ ప్రాముఖ్యం తదితర అంశాలను వివరించారు.
- హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకున్న వారికి పూలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.
- సూపర్ హీరో పేరుతో ముద్రించిన కార్డు, బహుమతులు అందజేశారు.
- రహదారి నిబంధనలు, సిగ్నల్స్, వాటి ఉపయోగం, యూటర్న్, వేగం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుంటే జరిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.
- మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.
- ఆటో చోదకులకు యూనిఫాంలు కూడా అందజేశారు.
- విద్యార్థి స్థాయి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.

ప్రధాన లక్ష్యాలు ఇవే..

- ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి.
- మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. నడిపితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి.
- రహదారి నిబంధనలు, సిగ్నల్స్ వ్యవస్థ, ఇతర అంశాలపై అవగాహన లేని వారికి లైసెన్స్‌లు జారీ చేయకూడదు.
- ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులో ఉండాలి.
- రహదారి భద్రతపై రోడ్డు సేఫ్టీ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలి.
- రోడ్డు సైన్స్‌ను పాఠ్యాంశంగా చేర్చాలి.

ప్రమాద రహిత ప్రయాణమే ధ్యేయం

సంస్థ వెయ్యి రోజుల కార్యక్రమంలో చాలా మందికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన లేదని గుర్తించాం. రహదారి నియమావళిపై కశ్మీర్‌లోనూ ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించాం. భవిష్యత్తులో సంస్థ పక్షాన మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం. ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా ముందుకు సాగుతాం.

- ఘన శ్యామ్ ఓజా, సంస్థ అధ్యక్షుడు



సామాజిక స్పృహ, క్రమశిక్షణకు ప్రాధాన్యం

శిక్షణ శిబిరం.. విద్యార్థులకు ఉపయోగం

న్యూస్‌టుడే, జ్యోతినగర్(మార్కండేయకాలనీ)

విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక స్పృహ పెంపునకు స్కౌట్స్ అండ్ గైడ్స్ వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. పాఠశాల దశలోనే వారిలో క్రమశిక్షణ, వ్యక్తిత్వ, శారీరక వికాసానికి కృషి చేస్తోంది. క్షేత్రస్థాయిలో వివిధ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని స్కౌట్స్ యూనిట్‌లో ఉన్న విద్యార్థులకు గోదావరిఖని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో అయిదు రోజుల పాటు తృతీయ సోపాన్ శిబిరంలో శిక్షణిస్తున్నారు. విద్యార్థులు చురుగ్గా పాల్గొని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. వారి అభిప్రాయాలు, లక్ష్యాలతో 'న్యూస్‌టుడే' కథనం.

18 పాఠశాలల్లోనే అమలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 450పైనే ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ తప్పనిసరిగా అమలు చేయాలనే విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది. స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లు అన్ని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం 18 పాఠశాలల్లోనే అమలవుతోంది. ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడితేనే ఉమ్మడి జిల్లాలో అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

రాష్ట్రపతి అవార్డు పొందాలనుంది



స్కౌట్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రపతి అవార్డు పొందాలనుంది. గత రెండు సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నా. ప్రస్తుతం శిక్షణ శిబిరంలో టెంటు కట్టడం, మార్చ్ ఫస్ట్, శ్రమదానం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నా. శిక్షకుల మార్గదర్శకంలో రాజ్యపురస్కార్ శిక్షణ శిబిరంలో పాల్గొనే దిశగా కసరత్తు మొదలుపెడుతున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తృతీయ సోపాన్‌లో మంచి ప్రతిభ కనబరిచాను.

విశ్వశ్రీ, 8వ తరగతి, కరీంనగర్

పాత్రలు లేకుండా వంట చేశాం



స్కౌట్స్ ద్వారా ఇతరులకు సేవ చేయడం, పెద్దలను గౌరవించడం, వృద్ధులను చేరదీయడం తదితర లక్షణాలు అలవడ్డాయి. శిక్షణ శిబిరంలో అటవీ ప్రాంతాల్లో తప్పిపోతే ఏం చేయాలో నేర్పుతారు. తృతీయ సోపాన్ శిబిరంలో శిక్షకులు మొదట పాత్రలు ఇవ్వకుండా కూరలు వండాలని సూచించారు. దీంతో ఇటుక, మట్టి, కట్టెల మంటతో వంట చేశాం.

రష్మిత, 9వ తరగతి, సుల్తానాబాద్, కేజీబీవీ

గైడ్ కెప్టెన్ కావడమే లక్ష్యం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి తృతీయ సోపానాలను పూర్తి చేసుకున్నా. రాష్ట్రపతి క్యాంపులో పాల్గొని అవార్డు అందుకోవాలన్నదే నా కోరిక. శిక్షణలో సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోగలుగుతాం. స్కౌట్స్ గైడ్ కెప్టెన్ అవ్వడమే లక్ష్యం.

వర్షిణి, 7వ తరగతి, గోదావరిఖని

క్రమశిక్షణకు మారుపేరు



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగి ఉంటారు. ఇతర భాషలు, ఆచార కట్టుబాట్లు, సంస్కృతులపై అవగాహన ఉంటుంది. సమకాలీన అంశాలు తెలుసుకుంటారు. ప్రతిభ కనబరిస్తే రాష్ట్రపతి, గవర్నర్‌ల నుంచి అవార్డు పొందే సువర్ణ అవకాశం లభిస్తుంది.

సూర్యదేవర జ్యోతి, జిల్లా గైడ్ కమిషనర్

హత్య కేసులో ఇద్దరికి జైలు



సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ముస్తాబాద్ గ్రామానికి చెందిన పండుగ రాజంకు, తన అక్క మరియమ్మతో ఆస్తుల పంపకంపై గొడవలు జరిగాయి. ఈక్రమంలో 2020 సెప్టెంబరు 1న పండుగ మరియమ్మ, ఆమె కుమారుడు పండుగ మల్లేశంలు పండుగ రాజంను గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో మరియమ్మకు పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా, మల్లేశంకు జీవిత ఖైదుతోపాటు రూ.2,500 జరిమానాను ప్రధాన న్యాయమూర్తి విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

పలుకుల చిలుక.. అదిరింది నీ ఆవాసం



తాటి కల్లుకు ఉపయోగపడని చెట్లను రామచిలుకలు తమ నివాసంగా మార్చుకున్నాయి. మానకొండూర్ పరిధి చెంజర్ల సమీపంలోని జాతీయ రహదారి వెంబడి రేణుక ఎల్లమ్మ ఆలయం ఎదుట ఉన్న తాటి చెట్లకు.. కొన్ని చిలుకలు రంధ్రాలు చేసుకొని ఉంటున్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- న్యూస్‌టుడే, మానకొండూర్

నీ బిడ్డ నీలగౌరి.. నిత్య మల్లె చెట్టేసి!



'బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా.. కోల్' అంటూ సాగే పాటలతో మంథని పట్టణంలో వాడవాడలా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అయిదు రోజులుగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ వస్త్ర ధారణతో భక్తిశ్రద్ధలతో బొడ్డెమ్మను పూజిస్తున్నారు. చెరువు మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి, ప్రత్యేక వేదికపై ఉంచి ధూప దీప నైవేద్యాలు నివేదిస్తున్నారు. బొడ్డెమ్మ చుట్టూ ఆడిపాడుతున్నారు. -న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

అధిక సాంద్రతపై అన్నదాతల ఆశలు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

పత్తి దిగుబడులపై శాస్త్రవేత్తల భరోసా


సైదాపూర్‌లో అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తి

ప్రస్తుత సీజన్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుచేసిన రైతులు దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గతేడాది వానాకాలం సీజన్‌లో ఇదే పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేసినా ఆశించిన ఫలితం రాలేదు. దిగుబడులు ఎక్కువ వస్తాయని వ్యవసాయాధికారులు ప్రోత్సహించినా.. తీరా పంట చేతికొచ్చేసరికి నిరాశే ఎదురైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి సాగులో మెలకువలు పాటించి దిగుబడులు పెరిగేలా.. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు రైతులకు భరోసా కల్పిస్తున్నారు.

గతేడాది నామమాత్రంగానే..

జిల్లాలో గతేడాది 195 ఎకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేశారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా ఎకరాకు 12-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు ప్రోత్సహించడంతో రైతులు ముందుకొచ్చారు. తీరా పత్తి చేతికి వచ్చేసరికి ఎకరాకు అయిదు నుంచి ఏడు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఒక్క సైదాపూర్ మండలంలోనే 25 మంది రైతులు 36 ఎకరాలు సాగు చేయగా అందరికి 5-7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అయితే గతేడాది అధిక వర్షాలు, వాతావరణ అనుకూలించక పోవడంతో ఆశించిన దిగుబడులు రాలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అందని ఆర్థిక ప్రోత్సాహం

సాధారణ సాగుతో పోలిస్తే అధిక సాంద్రత సాగులో పెట్టుబడి ఎక్కువ. అందుకే ఆర్థిక ప్రోత్సాహం కింద అదనపు పెట్టుబడిని ఎంపిక చేసిన రైతులకు ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధానంలో ఒక్కో రైతుకు ఎకరాకు రూ.3,400 నుంచి రూ.4,980 చొప్పున చెల్లించేలా వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. కానీ ఏడాది దాటినా నేటికీ అందకపోవడం రైతులను నిరాశకు గురిచేసింది. రైతుల బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని.. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

469 ఎకరాల్లో సాగు..



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అధిక సాంద్రత విధానంలో 524 ఎకరాల్లో సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్రామాలు, రైతుల ఎంపిక, సాగు బాధ్యతను ఈసారి జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్తలకు అప్పగించింది. జిల్లాలోని 44 గ్రామాల్లో మొత్తం 10 విభాగాల్లో ఎంపిక చేసిన వివిధ కంపెనీల విత్తనాలతో అధిక సాంద్రత విధానంలో 315 ఎకరాలు, మధ్యస్థ సాంద్రత పద్ధతిలో 154 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా 469 ఎకరాల్లో పత్తి సాగయ్యేలా రైతులను ప్రోత్సహించారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు

రైతులు సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవడంతో పాటు సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలి. ఈసారి ఎకరా పత్తికి 11-14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. భవిష్యత్తులో సాగు విస్తీర్ణం పెంచాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

- డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

పెరుగుతున్న పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. యార్డుకు బుధవారం 30 ట్రాలీల కొత్త విడిపత్తి, 11 ట్రాలీల పాత విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్ కొత్త విడిపత్తి రూ.6,000 నుంచి రూ.6,850 దాకా.. పాత విడిపత్తి రూ.7,000 నుంచి రూ.7,600 వరకు ధర పలికింది. 75 క్వింటాళ్ల బస్తాల కొత్త పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.6,800 వరకు వ్యాపారులు ధర నిర్ణయించారు. కొత్త విడిపత్తి మంగళవారం కంటే తాజాగా రూ.211లు తగ్గినట్లు మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. కొత్తపత్తి అధిక తేమతో ఉండటంతోనే ధర పడిపోయిందని చెప్పారు.

30న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఈ నెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ వెంకటేశ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

అన్ని దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేయాలి

వేములవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వేములవాడ పట్టణంలో యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగుల ఐకాస సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి రమేశ్‌బాబు అధ్యక్షతన జరిగింది. దీనికి జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెద్ద దేవాలయాలకు పీఆర్‌సీ అమలు చేసి చిన్న దేవాలయాలకు చేయలేదని పేర్కొన్నారు. 261 జీవో సవరణ చేసి ఉద్యోగులందరికీ ఒకే రకమైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయాల్లో భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా అందుకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను పెంచాలన్నారు. ఆలయాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం ఉన్నా తమ సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మిర్యాల నాగేందర్‌రెడ్డి, పరమేశ్వర్, వేముల ప్రభాకర్, బుద్ధి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు దయాకర్‌రెడ్డి, భాస్కర్, సాయి, హరికిషన్, కృష్ణ, ఉమేశ్‌శర్మ, నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు కపేంద్రాచారి, మదన్‌కుమార్, అర్చకులు, వివిధ ఆలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు రాజన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.

శ్రీరామసాగర్‌కు స్థిరంగా వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 33,238 క్యూసెక్కుల చొప్పున వరదనీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 18 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. 2 స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది.

మధ్యమానేరుకు..

బోయినపల్లి : రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయానికి వరద కొనసాగుతుంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 9,259 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రమాదాల కట్టడికి చర్యలు

● ఆర్టీసీలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు


జగిత్యాల డిపోలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది

న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆర్టీసీ సంస్థ డ్రైవర్లు, కండక్టర్లకు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తోంది. కొందరు మద్యం తాగి బస్సులు నడుపుతున్న ఘటనలు దృష్టికి రావడంతో పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి చేసింది. డ్రైవర్లు, కండక్టర్లను పరీక్షించిన తరువాతనే విధుల్లోకి తీసుకొని బస్సులను అప్పగించే విధానం అమలు చేస్తున్నారు. కరీంనగర్ జోన్‌లోని మొత్తం 39 డిపోల్లో కలిపి ఆర్టీసీ బస్సులు 2242, ప్రైవేటు 1347 మొత్తం కలిపి 3589 బస్సులు ఉన్నాయి. ఇవి రోజుకు సగటును 15.94 లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి చేరవేస్తున్నాయి. ఒక బస్సు అంటే 60 కుటుంబాలనే భావనతో ప్రయాణికులను క్షేమంగా ఇంటికి చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

విధుల నుంచి తొలగింపు

మద్యం తాగి బస్సులు నడపకుండా పరీక్షలు నిర్వహించడంతోనే సరిపెట్టకుండా మరోసారి పునరావృతం కాకుండా ఆర్టీసీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. పరీక్షల ఫలితాలు తదితరాలపై విచారణ జరిపి సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు వెనుకాడటం లేదు. జగిత్యాల డిపో పరిధిలో ఇప్పటి వరకు 17 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఆర్టీసీకి చెందిన ఆరుగురు డ్రైవర్లు, ఒక కండక్టర్, మరో ఇద్దరు మెకానిక్‌లు, అద్దె బస్సులకు చెందిన నలుగురు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, ఇద్దరు మెకానిక్‌లు మద్యం తాగి విధులకు హాజరైనట్లు గుర్తించారు. వీరిలో పలువురిని విధుల నుంచి తొలగించగా తక్కిన కేసులు విచారణలో ఉన్నాయి.

రెండేళ్లలో 255 కేసులు

మద్యం తాగి విధులకు హాజరవుతున్న తీరుపై ఆర్టీసీ సంస్థ కఠినంగా వ్యవహరించడం సత్ఫలితాలు ఇస్తోంది. విజిలెన్స్ విభాగం ద్వారా పటిష్ఠ నిఘా అమలు చేయడంతో క్రమంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గుతున్నాయి. ప్రతి డిపో వద్ద మొదట బస్సు బయలుదేరే సమయంలో, ఆ తరువాత మధ్యలో ఎక్కడా మద్యం తాగినా గుర్తించే విధంగా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇలా సగటున రోజుకు 80 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతేడాది 39 డిపోల్లో కలిపి ఆర్టీసీ సంస్థకు సంబంధించి 52 కేసులు నమోదు కాగా అద్దె బస్సులకు చెందినవి 94, మొత్తం కలిపి 146 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఆర్టీసీలో 57, అద్దె బస్సులకు సంబంధించి 52, మొత్తం కలిపి 102 కేసులు నమోదు చేశారు.

సిబ్బంది సంక్షేమానికి శ్రీకారం

సంస్థ సిబ్బంది సంక్షేమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. తాజా గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ పేరిట కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అన్ని రకాల వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రధానంగా గుండెకు సంబంధించిన టుడీఎకో, నేత్ర పరీక్షలు, ఛాతి తదితర పరీక్షలు చేయించి సిబ్బంది ఆరోగ్యం విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించింది. బస్సుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాల భర్తీ లేనందున తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా సంస్థ అన్ని విధాలా కృషి చేస్తోంది. ఇందులో బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు ఒక భాగం. ఆర్టీసీ లక్ష్యాలు, ప్రాథమ్యాలు, నిబంధనలు ఆకలింపు చేసుకొని సిబ్బంది సంస్థ అభివృద్ధికి తమవంతుగా సహకరిస్తున్నారు. భవిష్యత్తులోనూ జగిత్యాల డిపోను మునుపటిలా మొదటి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తాం.

- సునీత, డీఎం, జగిత్యాల

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ధర్మారం

? ఖిలావనపర్తి ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట కాలువలో మురుగు నిలిచి దోమల బెడద పెరిగింది. నెల రోజులుగా జ్వరాలతో బాధ పడుతున్నాం. విద్యార్థులూ ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. -ఓదెలు, ఖిలావనపర్తి

✔ నిలిచిన మురుగును వెంటనే తొలగిస్తాం. కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ఈ సమస్య నెలకొంది. వెంటనే పరిష్కరిస్తాం. -మారుతి, ఖిలావనపర్తి పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, సుల్తానాబాద్

? రేగడిమద్దికుంటలో పలు చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి నీరు కలుషితమవుతోంది. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. -రాజు, గ్రామస్థుడు

✔ ఈ సమస్యను ఇటీవలే మిషన్ భగీరథ పథకం నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తాం. -శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

ఉచిత అకాడ శిక్షణ శిబిరం ప్రారంభం

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి ఉన్నత పాఠశాలలో శ్రీహనుమాన్ అకాడ ఉచిత శిక్షణ శిబిరం బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సరదాగా కత్తి దువ్వారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరం ప్రారంభంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరిగౌడ్, నిర్వాహకులు నాగరాజు, సాగర్, సాయిరాం, రమణ, కీర్తన పాల్గొన్నారు.


అకాడ శిక్షణ ప్రారంభంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

వ్యక్తిగత పరిరక్షణ.. సంపూర్ణ పారిశుద్ధ్యం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని రామగుండం నగరపాలక సహాయ కమిషనర్ రాజలింగం కోరారు. పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత పరిరక్షణపై కార్మికులకు రామగుండం నగరపాలక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా వ్యక్తిగత ఆరోగ్య కిట్లను ధరిస్తూ పనులు నిర్వహించాలని కోరారు. పారిశుద్ధ్య నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'కామ్ ఫౌండేషన్' ప్రతినిధి చిన్ని కృష్ణ వివరించారు. నగరపాలక పారిశుద్ధ్య పర్యవేక్షకులు సునీల్, ఆరోగ్య సహాయకులు సునీల్‌రాథోడ్, పర్యావరణ ఇంజినీర్ మధూకర్, ఎం.ఐ.ఎస్. ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్జీ-I జీఎం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఆర్జీ-1 జీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్న డయల్ యువర్ జీఎం కార్యక్రమంలో 08728-244112 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.



జీఎం కార్యాలయం ఎదుట తెబొగకాసం ధర్నా

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నికర లాభాల్లో కార్మికులకు వాటాను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెబొగకాసం నాయకులు బుధవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ముందు ధర్నా చేశారు. అప్పటివరకు పోరాటం చేస్తామన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెబొగకాసం అధ్యక్షుడు ఎం.రాజిరెడ్డి పాల్గొని యాజమాన్యం, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు శంకర్, రామమూర్తి, రవి, వెంకటేశ్, ప్రవీణ్, శ్రీనివాస్, రాజేశం, సత్యనారాయణ, జోసెఫ్, శేషగిరి, సాయి, తిరుపతి, అంజయ్య, మల్లేశ్, లక్ష్మణ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: లాభాల వాటా విషయంలో కార్మికుల పక్షాన ఉండాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యానికి, ప్రభుత్వానికి తొత్తులుగా మారాయని తెబొగకాసం నాయకుడు రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాలనీలోని యూనియన్ కార్యాలయం నుంచి ఆర్జీ-2 జీఎం కార్యాలయం వరకు తెబొగకాసం నాయకులు ర్యాలీ తీశారు. అనంతరం జీఎం కార్యాలయం ప్రధాన ద్వారం ముందు అరగంట బైఠాయించి నిరసన తెలిపారు. అధికార ప్రతినిధి అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఓసీపీ-3, వకీలుపల్లెగని తదితర గనుల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): లాభాల ప్రకటన తీరును నిరసిస్తూ బుధవారం తెబొగకాసం(తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం) ఆధ్వర్యంలో ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రాతినిధ్య, గుర్తింపు సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా లాభాలు ప్రకటించాయంటూ జీఎం సుధాకర్‌రావుకు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, నాయకులు కుమార్‌యాదవ్, భాస్కర్, సంపత్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


ఖని: ధర్నాలో మాజీ ఎమ్మెల్యే చందర్, తెబొగకాసం నాయకులు


కమాన్‌పూర్: జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న తెబొగకాసం నాయకులు

భారాస హయాంలో సంస్థ అద్భుత ప్రగతి

గోదావరిఖని, న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో సింగరేణి అద్భుత ప్రగతి సాధించిందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖనిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రతి సంవత్సరం పెంచిన లాభాలకు అనుగుణంగా వాటాను కార్మికులకు పంపిణీ చేస్తూ వచ్చారన్నారు. 19 వేల మంది సింగరేణి వారసులకు ఉద్యోగాలు కల్పించారని, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం చెల్లించారని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే వాస్తవం తెలుసుకోకుండా మాట్లాడుతున్నారన్నారు.

ఒప్పంద కార్మికులకు హైపవర్ వేతనాల చెల్లింపునకు కృషి

గోదావరిఖని, న్యూస్‌టుడే: కోల్ ఇండియా మాదిరిగా ఒప్పంద కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించే విధంగా కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ నాయకుడు, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. గోదావరిఖనిలో బుధవారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఒప్పంద కార్మికులతో ఆయన మాట్లాడారు. వందేళ్ల చరిత్ర ఉన్న సింగరేణిలో ఇప్పటి వరకు ఒప్పంద కార్మికులకు లాభాల వాటా పంపిణీ చేసింది లేదన్నారు. ఇది ఐఎన్టీయూసీ నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. ఈ ప్రాంతంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. అనంతరం కాంట్రాక్టు కార్మికులు జనక్‌ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. నాయకులు ధర్మపురి, సమ్మయ్య, శంకర్‌రావు, శ్యామ్, లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్, శేషారత్నం, దాస్, అక్రమ్, అక్బర్‌అలీ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

'లాభాలను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం'

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి లాభాలను యాజమాన్యం, ప్రభుత్వం కలిసి పక్కదారి పట్టిస్తున్నాయని ఏఐటీయూసీ నాయకుడు ఎం.నర్సింహారావు ఆరోపించారు. జీడీకే-11 గనిపై బుధవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. నికర లాభాన్ని ఐఎన్టీయూసీ నాయకులు స్థూల లాభంగా చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి నిధులను వాడుకోవడానికి ప్రయత్నిస్తుందన్నారు. సంస్థను కాపాడుకునేందుకు కార్మికులు ఐక్యంగా కావాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, నరహరిరావు, మహేశ్, గజేంద్ర, మల్లేశ్, నవీన్‌కుమార్, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖాతాలో జమ చేయాలని వినతి

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికులకు ప్రకటించిన లాభాల వాటా రూ.5000 నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డ్రైవర్లు బుధవారం ఆర్జీ-1 పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. దసరా లోపు జమ చేయాలని విన్నవించారు.

ఐఎన్‌టీయూసీతో సమస్యల పరిష్కారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. ఏఎల్‌పీలో బుధవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గడ్డం తిరుపతియాదవ్, రామారావు, సత్రం సమ్మయ్య, సాయికృష్ణ, రామిల్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కార్పొరేట్ వైద్యం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని నిర్మించాలని బీఎంఎస్ నాయకుడు వై.సత్తయ్య డిమాండ్ చేశారు. జీడీకే 2-ఎ గనిపై బుధవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి గురువారం జీఎం కార్యాలయం ముందు తలపెట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పూర్తి లాభాలపై కార్మికులకు వాటా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేశ్, సారంగపాణి, రవీందర్, లక్ష్మయ్య, సాంబయ్య, వెంకటస్వామి, మల్లేశం పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అధికారుల పరిశీలన

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి అక్టోబర్ 31 వరకు చేపట్టిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్ఓటూ జీఎం రఘుపతి, ఏరియా పర్యావరణ, పర్సనల్, సివిల్, అటవీ విభాగాల అధికారులు సెంటినరీకాలనీలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. మార్కెట్ యార్డు, బస్‌స్టేషన్, పార్క్, జీఎం కార్యాలయ పరిసరాలను సందర్శించి పరిశుభ్రతా చర్యలపై సమీక్షించారు. ఏరియా పర్యావరణ అధికారి రాజారెడ్డి, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం, సివిల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, డీపీఎం గుర్రం శ్రీహరి, అటవీ అధికారి కల్యాణ్, సూపర్‌వైజర్ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.


సెంటినరీకాలనీలో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

నేర వార్తలు

రూ.లక్ష విలువైన రాగి తీగ చోరీ

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్తు ట్రాన్సుఫార్మర్ల మరమ్మతు దుకాణంలో రూ.లక్ష విలువైన రాగి తీగ చోరీ జరిగిన ఘటన సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధి శాస్త్రీనగర్ శివారులో రెండు రోజుల కిందట జరగగా ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై శ్రావణ్‌కుమార్, దుకాణ నిర్వాహకుడు నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం సోమవారం అర్ధరాత్రి కిటికీ తొలగించి దుకాణంలో చొరబడిన దొంగలు రాగి తీగల చుట్టలను దొంగిలించారు. మంగళవారం ఉదయం సిబ్బంది గుర్తించి యజమానికి చెప్పారు. బుధవారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుకాణం ఎదుట నిలిపిన ద్విచక్రవాహనం...

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: దుకాణం ఎదుట నిలిపిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన సుల్తానాబాద్ పూసాలరోడ్డులో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్, బాధితుడి కథనం ప్రకారం పట్టణంలో బుక్ స్టాల్ నిర్వహించే రవీందర్ రాత్రి ద్విచక్రవాహనాన్ని దుకాణం ఎదుట నిలిపి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తి తీసుకెళ్లాడు. వాహనం చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

యువతీయువకులను వేధించిన ఆకతాయిల రిమాండ్

పాలకుర్తి(అంతర్గాం), న్యూస్‌టుడే: యువతీయువకులను వేధించిన ముగ్గురు ఆకతాయిలను రిమాండ్‌కు తరలించిన ఘటన అంతర్గాం పోలీసు ఠాణా పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. అంతర్గాం ఎస్సై వెంకటస్వామి కథనం మేరకు.. యువతీయువకులు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ దర్శనం అనంతరం దారి వెంట వెళ్తున్న క్రమంలో గోదావరిఖనికి చెందిన ముగ్గురు వ్యక్తులు వారి వీడియో, ఫొటోలు తీసి డబ్బులు ఇవ్వకుంటే మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతామంటూ బెదిరించారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

రాజారాం ఆశయ సాధనకు కృషి చేయాలి

మంథని, న్యూస్‌టుడే: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు బోగే రాజారాం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. రాజారాం మూడో వర్ధంతి సందర్భంగా బుధవారం మంథనిలో నిర్వహించిన సంతాప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా రాజారాం దళితులను చైతన్యవంతం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రవి, సీనియర్ న్యాయవాది రఘోత్తంరెడ్డి, దళిత సంఘాల నాయకులు శంకర్‌లాల్, బూడిద రాజయ్య, కుమార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.


సంతాప సభలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ముత్తారం: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి తిరుమల అన్నారు. ముత్తారం మండలం దర్యాపూర్‌లోని గుజ్జుల రాజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని నాలుగు ఎకరాల్లో బుధవారం ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు సూచనలు చేశారు. మంథని ఉద్యాన అధికారి జ్యోతి, ఆయిల్ పామ్ కంపెనీ సీఈవో కేశవ్, ప్యాక్స్ మాజీ ఛైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


ఆయిల్‌పామ్ క్షేత్రంలో ఉద్యాన అధికారులు


పేరపల్లి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సునీల్‌రెడ్డి

భాజపాతోనే దేశం పురోగతి

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశం పురోగతి సాధిస్తుందని భాజపా జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కమాన్‌పూర్ మండలం పేరపల్లిలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కమాన్‌పూర్, నాగారం గ్రామాల్లో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మండలాధ్యక్షుడు జంగపెల్లి అజయ్, మంథని నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌ఛార్జి ముచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, కొయ్యడ సతీశ్, మల్లారపు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలి

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను, పీఆర్‌సీని వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కిరణ్ కోరారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గోదావరిఖని గాంధీపార్కు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రతాప్‌చారి, కార్యదర్శులు రమేష్, రాంబాబు, చంద్రశేఖర్, సతీష్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేసి పత్రాన్ని అందజేస్తున్న డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కిరణ్, ఇతరులు

ఐఎఫ్‌టీయూ నేతకు నివాళి

గోదావరిఖని, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మృతి చెందిన ఐఎఫ్‌టీయూ నాయకుడు అర్జున్‌రావుకు కార్మిక నాయకులు బుధవారం నివాళులర్పించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. ఐఎఫ్‌టీయూ నిర్మాణంలో పూర్తిస్థాయిలో పనిచేసిన అర్జున్‌రావు మృతి తీరని లోటన్నారు.

కొత్త పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మంథని, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హనుమానాయక్ ఆదేశించారు. బుధవారం ఆయన పది మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటర్ల ముసాయిదా జాబితాను అక్టోబర్ 29న కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి శశిభూషణ్, తహసీల్దార్లు, ఎన్నికల సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

అభివృద్ధి పనులు వేగిరం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి పురపాలిక పరిధిలో అభివృద్ధి పనులను వేగిరం చేయనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన పురపాలిక కార్యాలయంలో పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతూ, మురుగు పారుదల వ్యవస్థను బాగు చేయనున్నట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. ఈ సందర్భంగా 26 అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ ఛైర్‌పర్సన్ నజ్మీన్‌సుల్తానా, కమిషనర్ వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ మమతారెడ్డి, కమిషనర్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ మమతారెడ్డి

జిల్లా స్థాయి కళోత్సవ్ పోటీలకు విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కళోత్సవ్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. క్లాసికల్ డాన్స్‌లో వెన్నంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.శృతి, ఎ.తన్మయశ్రీ మొదటి బహుమతి, అదే పాఠశాలకు చెందిన రుతిక బృందం జానపద నృత్యంలో రెండవ బహుమతి, కుట్లు, అల్లికలు విభాగంలో సహస్రవర్ధిని మొదటి బహుమతి, పాటల పోటీల్లో కాల్వశ్రీరాంపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.కరుణశ్రీ మొదటి బహుమతి, చిత్రలేఖనంలో యు.కార్తీక్, బి.చరణ్, ఎండీ.రుమానుద్దీన్ బహుమతులు సాధించారు. వీరు ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈవో మహేశ్ తెలిపారు.

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కళోత్సవ్ పోటీలను బుధవారం నిర్వహించారు. పాటల విభాగంలో వైష్ణవి(పొట్యాల జడ్పీ ఉన్నత పాఠశాల), సహస్ర(కేజీబీవీ అంతర్గాం), క్లాసికల్ డ్యాన్స్‌లో ఐశ్వర్య(లింగాపూర్ ఆదర్శ పాఠశాల), జె.వైష్ణవి(అంతర్గాం కేజీబీవీ), డ్రాయింగ్ విభాగంలో పొట్యాల పాఠశాలకు చెందిన శ్రీచరణ్య, వికాస్‌లు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఫోక్ డ్యాన్స్‌లో కేజీబీవీ అంతర్గాం, జడ్పీ హెచ్‌ఎస్ అంతర్గాం మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. మోనో యాక్షన్‌లో అంతర్గాం కేజీబీవీకి చెందిన వైష్ణవి, డ్రామాలో జడ్పీహెచ్‌ఎస్ అంతర్గాం విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వీరు ఈ నెల 27, 28వ తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలలో పాల్గొననున్నట్లు ఎంఈవో ఏకాంబరం తెలిపారు.

ఓదెల: ఓదెల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి కళోత్సవ పోటీలు నిర్వహించారు. జానపద నృత్య పోటీల్లో ఓదెల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, డ్రామా పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఎంఈవో వై.రమేశ్, ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మ వారిని అభినందించారు.

హిందీ పక్వాడా వేడుక

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: తెలంగాణ హిందీ పక్వాడా వేడుకల్లో భాగంగా ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టు ఉద్యోగులకు టెంపర్‌వరీటౌన్‌షిప్‌లోని ఈడీసీ భవనంలో బుధవారం హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు హిందీ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్టీపీసీ జీఎంలు, హెచ్ఆర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రిమినల్, కాంపౌండబుల్, సివిల్, ఆస్తి తగాదాలు, కుటుంబ, వైవాహిక, చెక్‌బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్తు చౌర్యం తదితర కేసుల బాధితుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇరు పక్షాలకు న్యాయం జరుగుతుందన్నారు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పాలకుర్తి(రామగుండం): రామగుండం పట్టణంలోని అయోధ్యనగర్‌కు చెందిన పందుల మధునయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ బుధవారం పరామర్శించారు. మధునయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇబ్రహీం, మహేందర్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సంతాపం ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు ఉన్నారు.

ఎల్కలపల్లిలో అభివృద్ధి పనులకు వినతి

ఎల్కలపల్లి(ఫెర్టిలైజర్ సిటీ): ఎన్టీపీసీ ప్రభావిత గ్రామం ఎల్కలపల్లిలో పలు చోట్ల సిమెంటు రోడ్లు నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాసిన వినతిపత్రాన్ని గ్రామస్థులు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు బుధవారం సమర్పించారు. చింతల చెరువుపై రోడ్డు, వాగుపై వంతెన నిర్మించాలని కోరారు. గ్రామ మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

ధర్మారం: ఏబీవీపీ ధర్మారం కార్యదర్శిగా ఆకుల వంశీ, ఉపాధ్యక్షులుగా మధు, జశ్వంత్, నాగేష్, సంజన, సంయుక్త కార్యదర్శులుగా ఆకాష్, మహిత, సంతోష్, అజయ్, చందు తదితర కార్యవర్గాన్ని నియమించినట్లు జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్తం

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

మంథని: పంచాయతీల్లో అక్టోబర్‌లోగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బుచ్చయ్య ఆదేశించారు. బుధవారం మంథని మండల పరిషత్ కార్యాలయంలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. పారిశుద్ధ్యం, ఓటరు నమోదు, పన్ను వసూళ్లు, విద్యుత్తు బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ స్వచ్ఛతా హీ సేవ, ఎల్ఆర్ఎస్ సర్వే వివరాలు తెలుసుకున్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి సతీశ్, ఎంపీడీవో పూర్ణచందర్, ఎంపీవోలు శేషయ్యసూరి, కిరణ్, ఉమేష్, భాస్కర్, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్లు రేణుక, రాఘవులు పాల్గొన్నారు.

ఎంఈవోలుగా బాధ్యతల స్వీకరణ

న్యూస్‌టుడే యంత్రాంగం: జిల్లాలోని వివిధ మండలాల్లో విద్యాశాఖాధికారులుగా నియమితులైన సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇరుగురాళ్ల ఓదేలు(ముత్తారం), విజయ్‌కుమార్(కమాన్‌పూర్), కొమురయ్య(రామగిరి), కూనారం మహేశ్(కాల్వశ్రీరాంపూర్), వై.రమేశ్(ఓదెల), కె.సరస్వతి(జూలపల్లి) రామగుండం(జి.చంద్రయ్య), అంతర్గాం(ఏకాంబరం), పాలకుర్తి(విమల) మండల వనరుల కేంద్రాల్లో విధుల్లో చేరారు.

విద్యార్థులకు క్యాలెండర్ల పంపిణీ

మంథని గ్రామీణం: ఎక్లాస్‌పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం రూమ్ టు రీడ్ గ్రంథాలయ క్యాలెండర్లను పంపిణీ చేశారు. రూమ్ టు రీడ్ జిల్లా కోఆర్డినేటర్ మధు పాల్గొన్నారు.

షీ టీం అవగాహన సదస్సు

మంథని గ్రామీణం: రామగుండం ఏఎస్ఐ మల్లన్న ఆధ్వర్యంలో గుంజపడుగులోని ఉన్నత పాఠశాలలో బుధవారం షీ టీంపై అవగాహన కల్పించారు. వేధింపులపై మహిళలు, విద్యార్థినులు 63039 23700 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. సభ్యురాలు స్నేహలత టీం సభ్యులు సురేష్, భరోసా కోఆర్డినేటర్ ఆశ్రిత, అస్మా పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: వరి పైర్లలో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అలివేణి సూచించారు. పలు గ్రామాల్లో పైర్లను బుధవారం ఆమె పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. ఏఈవోలు సువర్చల, శిరీష పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల వ్యవసాయాధికారి డి.నాగార్జున బుధవారం పెగడపల్లిలో తెగుళ్లు సోకిన వరి పైర్లను పరిశీలించారు. ఆకు ఎండు తెగులు నివారణకు ఎకరాకు 100 గ్రాముల ప్లాంటో మైసిన్ లేదా స్ట్రెప్టో మైసిన్ మందు పిచికారీ చేయాలన్నారు. పాముపొడ తెగులు నివారణకు 400 ఎంఎల్ హెక్సాకోనజోల్ పిచికారీ చేయాలని, తెగులు అధిక మోతాదులో ఉంటే ఎకరాకు వెయ్యి ఎంఎల్ హెక్సాకోనజోల్ మందును ఇసుకలో కలిపి చల్లాలన్నారు. లేకుంటే కాసుగమైసిన్ మందును పిచికారీ చేయాలన్నారు. నల్లి నివారణకు పెన్ ఫైరోక్సిమేట్ ఎకరానికి 350 ఎంఎల్ మందు పిచికారీ చేయాలన్నారు.

శ్రీలంక క్రికెట్ పోటీలకు ఎంపిక

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలం ఎదులాపూర్‌కు చెందిన బోల్తా సాహితీకుమార్ శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న అతడిలోని ప్రతిభను ఎంఎస్‌సీ క్రికెట్ అకాడమీ గుర్తించి అండర్-19 విభాగంలో అక్టోబర్ 20-29 వరకు జరిగే పోటీలకు ఎంపిక చేశారు.


సాహితీకుమార్

30న చలో కలెక్టరేట్

సుల్తానాబాద్: అసంఘటిత కార్మికుల కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన సుల్తానాబాద్‌లో కార్మికులతో సమావేశమయ్యారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

మార్కండేయకాలనీ: ఆర్ఎఫ్‌సీఎల్‌లోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్, నేషనల్ యూత్ ప్రాజెక్టులు వివేకానందుని సందేశంపై ఉపన్యాస పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గోదావరిఖని సీనియర్ న్యాయవాది బల్మూరి అమరేందర్, పాఠశాల ప్రిన్సిపల్ రవికాంత్, ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు పాల్గొన్నారు.


మంథనిలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు


పాలకుర్తిలో కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో...

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

గోదావరిఖని పట్టణం, మంథని, పాలకుర్తి(అంతర్గాం), న్యూస్‌టుడే: భాజపా సిద్ధాంత కర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా నాయకులు పాల్గొన్నారు.